manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

HAPPY Republic Day

సంపుటి : 01 | సంచిక : 209 | ఆదివారం | 26.01.2025



## నేడు జనగామకు చిన్నజీయర్ స్వామి

- బాణాపురంలో ద్రవిడ ప్రబంధ వేద సిద్ధాంత పురస్కారాలు
- వరాహస్వామికి స్వర్ణ కిరీట ధారణ

**జనగామ, మన చౌరాస్తా :** శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి నేడు జనగామకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఆస్థాన సిద్ధాంతి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించే ద్రవిడ ప్రబంధ వేద సిద్ధాంత పురస్కారాల సమర్పణ కార్యక్రమంలో జీయర్ స్వామి పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారి ఆహ్వానంతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం ఆలయ ప్రాంగణంలో కొలువైన వరాహస్వామి వారికి స్వర్ణ కిరీట సమర్పణ ఉంటుందని కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.







## ఓటు హక్కు విలువైంది

- 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఓటరు దినోత్సవంలో జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు హక్కు అని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

*- మన చౌరాస్తా, జనగామ*

2 లో



General News



# ఓటు హక్కు విలువైంది

- 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు హక్కు అని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన పార్లమెంట్, ఎంఎల్సీ ఎన్నికలకు జిల్లాలో మొత్తం 865 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా చేపట్టామన్నారు. జిల్లాలో 7 లక్షల 62 వేల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని, ఇందులో యువ ఓటర్లు 15 వేల మంది ఉన్నారని, వయోవృద్ధుల ఓటర్లు నాలుగు శాతం వరకు ఉన్నారని, స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి మండలంలో ఓటు హక్కు గురించి ఓటరుకు అవగాహన కల్పించామని వివరించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్ల ద్వారా, ఎన్నికల కమిషన్ పోర్టల్ ద్వారా, ఓటరు యాప్ ద్వారా, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, బూత్ స్థాయి కేంద్రాల ద్వారా కొత్త ఓటరుగా, అలాగే ఎవరికైనా ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే కూడా నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ ఏడాది థీమ్ వచ్చేసి నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ సూర్ (Nothing like Voting.. I Vote for Sure) అనే నినాదంతో ప్రజాస్వామ్యంలో ఓటుకు మించి ఏదీ లేదు.. ఖచ్చితంగా నేను ఓటు వేస్తాను అనే ఉద్దేశమని పేర్కొన్నారు. భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలతో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించిందన్నారు. ఇంతటి ఘనత గల భారతదేశంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. రాబోయే పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా యువత, వివిధ వర్గాలకు చెందిన వారు ఎక్కువగా పాల్గొనాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్లు, డీసీపీలు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది శక్తిమంతమైన ఆయుధమని, ఓటును అమ్ముకోకుండా బాధ్యతగా ఓటును వేయాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ప్రజలు, విద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు కొత్తగా నమోదైన యువ ఓటర్లకు వచ్చిన ఓటరు కార్డులను అందించారు. అలాగే బూత్ స్థాయి సిబ్బందికి మొమెంటో లతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు ఓటరు దినోత్సవం నేపథ్యంలో సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు హక్కుపై పాడిన పాటలు ఎంతగానో స్ఫూర్తిని నింపాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.సుహాసిని, ఆర్డీవో గోపీరాం, డీఆర్డీఓ వసంత, తహసీల్దార్ హుస్సేన్, కలెక్టరేట్ ఏఓ మన్సూర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, వయోవృద్ధులు, ప్రజలు పాల్గొన్నారు.









## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి



**చేర్యాల, మన చౌరాస్తా :** వ్యవసాయ పెట్టుబడి సహాయం పథకం యాసంగికి రైతు భరోసాకు 2025 జనవరి 1వ తేదీ వరకు కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులు అర్హులని చేర్యాల మండల వ్యవసాయ అధికారి ఏఓ పులి భోగేశ్వర్ శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు పెట్టుకోవడానికి అవసరమైన పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపబడిన దరఖాస్తు ఫారం ఈ పత్రాలను మీ క్లస్టర్ అధికారి అయిన వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఏఈఓ కి సమర్పించాలన్నారు. గతంలో పెట్టుబడి సహాయం వచ్చిన రైతుల బ్యాంకు, అకౌంట్ నంబర్నెలలో ఏమైనా మార్పులు ఉంటే బ్యాంకు అకౌంట్ నెంబర్ మార్పు కావలసిన రైతులు దరఖాస్తు ఫారం నింపి సమర్పించాలని సూచించారు. గతంలో రైతు బంధు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని సూచించారు.



## మార్కెట్ వైస్ చైర్మన్‌కు పరామర్శ


**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివ) తండ్రి శ్రీ కృష్ణమూర్తి ఇటీవల ఆనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి శనివారం నర్సింహులును పరామర్శించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు లొల్లకుంట్ల ప్రవీణ్, ఎస్ఎస్‌యూఐ జనగామ జిల్లా అధ్యక్షుడు అభి గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు కోతి రాములు, మాజీ ఉప సర్పంచ్ చిటకుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జోగు పరుశురాములు, కానుగంటి కృష్ణయ్య పాల్గొన్నారు.

## కవి ప్రభాకర్‌కు ఘన సన్మానం



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి లగిశెట్టి ప్రభాకర్ పాల్గొని కవితాగానం చేసి సన్మానం పొందారు. అఖిల భారతీయ సంక్షేమ సంఘం హైదరాబాద్ అధ్వర్యంలో రవీంద్ర భారతి లో జరిగిన ఈ కార్యక్రమంలో "చేనేత కళ" అనే కవిత ప్రభాకర్ వినిపించి పలువురిని ఆకట్టుకున్నారు. జనగామ జిల్లా నుంచి లగిశెట్టి ప్రభాకర్ తో పాటు చిత్రకారులు మసురం రాజేంద్రప్రసాద్, దేవరుప్పుల నుంచి అంకాల సోమయ్య, పాలకుర్తి నుంచి మ్యానపు భుజేందర్ కూడా పాల్గొని కవితాగానం చేసి సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా వీరికి జనగామ జిల్లా కళా, సాహిత్య సంస్థలు, కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

Local News



# మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలి

## ▪ డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన ప్రముఖులు

**వరంగల్, మన చౌరాస్తా :** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం త్వరలో చేపట్టబోతున్న 2కే రన్ కార్యక్రమ ప్రచార పోస్టర్ ను శనివారం వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులకి అభినందనలు తెలియజేశారు. ఈ 2కే రన్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ జేయూ స్టేట్ జనరల్ సెక్రటరీ తోకల అనిల్ కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ రావుల నరేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్ ప్రధాని కార్యదర్శి ఆవునూరి కుమారస్వా



మి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, కార్యవర్గ సభ్యులు నీరుటి శ్రీహరి, నాగపూరి అవినాష్, అడుప అశోక్, కౌడగానీ మోహన్ రావు, కమలాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తిలో ఓటరు దినోత్సవ ర్యాలీ

**పాలకుర్తి , మన చౌరాస్తా:** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు విద్యార్థులు రాజీవ్ చౌరస్తాలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. పలువురు విద్యార్థులకు పత్రాలు



అందజేశారు. తహసీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య , ఎస్సైలు పవన్ కుమార్,లింగారెడ్డి, ఆర్ ఐ.రాకేష్, వేణుగోపాల్ రెడ్డి, అంగన్వాడి, ఆశా వర్కర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.



# తొలి వేతనం విద్యార్థుల కోసం..

## ▪ నూతన ఉపాధ్యాయుడి ఔదార్యం

**నర్మెట, మన చౌరాస్తా :** డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ఓ తన తొలి వేతనాన్ని విద్యార్థుల కోసం ఖర్చు చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. జనగామ జిల్లాకు చెందిన రావుల రామ్మోహన్‌రెడ్డి 2024లో డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించారు. ఇటీవల నర్మెట మండలం మాన్ సింగ్ తండా పాఠశాలలో పోస్టింగ్ తీసుకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనకు వచ్చిన తొలి వేతనాన్ని విద్యార్థులకు ఖర్చు చేయాలని నిర్ణయించుకుని తమ విద్యార్థుల ఫొటోలతో క్యాలెండర్, ఐడీ కార్డులు, బెల్ట్, టైలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పగిడిపల్లి దామోదర్, అంగన్ వాడి టీచర్ లక్ష్మి, గ్రామ పెద్దలు జయరాం, కృష్ణ, శ్రీనివాస్, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట మండలంలోని హనుమంతపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సామల కమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో వైటెక్ సొల్యూషన్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ లో పనిచేస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగులు గత 14 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం సేవ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం రూ.40 వేల విలువ గల 100 లీటర్ల వాటర్ ప్యూరిఫైయర్ ను ప్రాథమిక పాఠశాల హన్మంతాపూర్ కు వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం ప్రతి సంవత్సరం అందించడం కోసం సిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రతినిధులు వెలుగండి శ్రీనివాస్, జొన్నాల శ్రీనివాస్ గుప్తా తెలిపారు . కార్యక్రమంలో సాఫ్ట్వేర్ ఉద్యోగులు అనూష, శ్రావ్య, రోహిత, బిందు ఉపాధ్యాయులు మినులాపురం పవన్, మమత, విద్యార్థుల తల్లిదండ్రులు ఇట్ట బోయిన రాజు, రజనీకాంత్, విజయ్ ,ఆంజనేయులు, రమేష్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డి పట్టణంలో జగుతున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలకు శనివారం జనగామ జిల్లా కేంద్రం నుంచి తలివెళ్తున్న సీపీఎం శ్రేణులు..

# లక్షకు నాలుగు లక్షలు

## ▪ నకిలీ నోట్లను విక్రయిస్తున్న ముఠా అరెస్టు
## ▪ వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝూ

**హనుమకొండ, మన చౌరాస్తా :**




ఒక లక్షకు నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు అందజేస్తామని నకిలీ నోట్ల విక్రయాలకు పాల్పడతున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను కేయూసి పోలీసులు అరెస్టు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి అసలు నోట్లు రూ .34. 84 లక్షలతో పాటు, రూ .21లక్షల నకిలీ నోట్లు, నకిలీ నోట్ల ముద్రణకు అవరమైన తెల్లకాగితాలు, ఒక కారు, ఆటో, తొమ్మిది సెల్ఫోన్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, మోరంపల్లి బంజర గ్రామం కు చెందిన మణికాల కృష్ణ, నాకిపేట తండ కు చెందిన దరావ్సోత్ శ్రీను, తేజావత్ శివ, ముఖమూడి మండలం గుగ్గోత్ వీరన్న, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం,కేశవాపూర్ గ్రామం చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్ , ఉడుతా మల్లేష్, కర్నూలు జిల్లా కుర్వపేట, వేల్పనూరు గ్రామం చెందిన బిజిని వేముల వెంకటయ్య చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ వివరాలను వెల్లడిస్తూ.. పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం నిర్వహించేవాడు. ఈ వ్యాపారం ద్వారా నిందితుడికి వచ్చే అదాయం తన అవసరాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఓ స్కెచ్ వేసాడు. ఈ ప్లాన్లో భాగంగా నిందితుడు ప్రధానంగా గొర్రెల వ్యాపారం ద్వారా పరిచమయిన వ్యక్తులతో తనకు అడవిలో డబ్బులతో కూడిన డ్రమ్ము దొరికిందని అందులోని డబ్బు వినియోగిస్తే తన కుటుంబంలో ఆరోగ్య సమస్యలు లేదా ఇతర సమస్యలు ఎదురౌవుతున్నాయని నమ్మించేవాడు. తనకు ఎవరైన ఒక లక్ష రూపాలు ఇస్తే వారికి అ డ్రమ్ములోని డబ్బు రెండింతలు ఇస్తానని. అలాగే ఒక లక్ష ఇస్తే నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లను ఇస్తానని నమ్మించేవాడు. ఇదే తరహాలో నిందితుడు రెండవ నిందితుడైన హనుమకొండ జిల్లా కేశవాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్ తో పరిచయం కావడంతో ప్రధాన నిందితుడు శ్రీనివాస్ వద్ద తాను అనుకున్న ప్లాన్ను అమలు చేసాడు. ప్లానులో భాగంగా పాల్వంచ అడవిలో ముందుగా అసలు, నకిలీ రూపాయల నోట్లతో భద్రపర్చిన డ్రమ్ము నుండి అసలు ఐదు వందల రూపాయాల నొట్ల కట్టను ప్రధాన నిందితుడు శ్రీనివాస్ చూపించడంతో అవి అసలు నోట్లని నమ్మిన శ్రీనివాస్ పది లక్షల అసలు నోట్లగాను ఇరువై లక్షల రూపాయలు అలాగే ఐదు లక్షల అసలు నోట్లకు ఇరువై లక్షల రూపాయల నకిలీ నోట్లు మార్పిడి చేసుకొనేందుకు నిందితుల ఇద్దరి మధ్య అంగీకారం కుదిరింది. కానీ తనకు డబ్బును హనుమ కొండకు తీసుకవచ్చి అందజేస్తేనే ఈ ఒప్పందా నికి అంగీకరిస్తానని నిందితుడైన శ్రీనివాస్ ప్రధాన నిందితుడుకి షరతు పెట్టడంతో ఇందుకు ప్రధాన నిందితుడు అంగీకరించినాడు.

### పోలీసుల వ్యూహం

నిందితుల ఇద్దరు మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం ప్రధాన నిందితుడు ప్రస్తుతం అరెస్టు చేసిన మరో నలుగురు నిందితులతో కారులో శుక్రవారం కేయూసీ అవుటర్ రింగ్ రోడ్డుపై పెగడపల్లి క్రాడ్ రోడ్ల వద్దకు చేరుకోగా అప్పటికే అక్కడే వున్న శ్రీనివాస్ మరో ఇద్దరు నిందితులతో కల్సి అసలు డబ్బుతో పాటు నకిలీ నోట్లను మార్పిడి చేసుకుంటున్న తరుణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు చిక్కారు. అను మానస్పదంగా కనిపించడంతో ముఠా సభ్యులందరినీ అదుపులోకి తీసుకొని వారి వద్ద వున్న బ్యాగులు, కారులో తనిఖీ చేయడంతో పెద్ద మొత్తంలో అసలు నగదుతోపాటు, నకిలీ నోట్లతో పాటు నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన తెల్ల కాగితాలను గుర్తించారు. పోలీసులు అదుపులోని తీసుకొని విచారించగా నింది తులంతా నేరాన్ని అంగీకరించారు. ప్రధాన నిందితుడు ఇదే తరహాలో మరో మిత్రుడి తో కలిసి తెల్ల కాగితా లపై ఐదు వందల నోటు ముద్రించి పలుమార్లు విక్ర యిస్తూ పోలీసులకు చిక్కడంతో సత్తుపల్లి, వీఎం బం జర, లక్ష్మీదేవిపేట పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయ్యాయి. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరి చిన ఏసీపీ దేవేందర్ రెడ్డి, కేయూసీ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎస్ఐ మాధవ్, హెడ్కానిస్టేబుల్ నర్సింగ రావు, కానిస్టేబుళ్ళు శ్యాంరాజు, సంజీవ్, సంపత్, హోంగార్డ్ రాజేందర్ను సీపీ అభినందించారు.

---

గణతంత్ర వేడుకలకు

# ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

**జనగామ , మన చౌరాస్తా :** గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి ఒక్కరికి 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు (జనవరి 26న) జరగనున్న కార్యక్రమం వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8:15 గంటలకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జాతీయ జెండాను ఆవిష్కరించాక, పోలీస్ శాఖచే గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు ధర్మకంచ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల కు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. 9:10 నుంచి 9:15లోపు పోలీస్ శాఖ వారిచే అతిథి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం 9:15 నుంచి 9:25 లోపు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరేడ్ కార్యక్రమం. 9:25 నుంచి 9:40 గంటల వరకు జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథి ప్రసంగపాఠం చదివి వినిపిస్తారు. ఈ సందర్భంగా 9:40 గంటల నుంచి 10:15 వరకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో దేశభక్తిని స్ఫురింపజేసే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. తదనంతరం ప్రభుత్వ శాఖలచే వివిధ అభివృద్ధి పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ల సందర్శన ఉంటుందని తెలిపారు.

---

ఏసీపీ జితేందర్ రెడ్డికి

# ఉత్తమ ఎలక్టరల్ అవార్డు

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించినందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డిని జాతీయ ఎన్నికల సంఘం ఉత్తమ ఎలక్టరల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ ఎలక్టోరల్ అవార్డు ను ఏసీపీ అందుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ డిజిపి జితేందర్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఏసీపీ కి అభిందనలు తెలిపారు




---

# కళ్లెం స్కూల్‌లో పేరెంట్ మీటింగ్

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** లింగాల ఘనపురం మండలం కళ్ళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లి దండ్రుల,ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రధానోపాధ్యాయులు వి.చంద్రయ్య అధ్యక్షతన పిల్లల భద్రతను అర్థం చేసుకోవడం,అందులో తల్లిదండ్రుల పాత్రపై పలు అంశాలపై చర్చ జరుపుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖాధికారి పడాల విష్ణుమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల ఘనపురం స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ మారోజు మల్లిఖార్జున్,పాథమిక పాఠశాల ఛైర్మన్ మబ్బు రాధ,ఉపాధ్యాయులు పసునూరి మంజుల,ప్రభాకర్,రాజు,శ్యాం మోహన్,తల్లిదండ్రులు పాల్గొన్నారు. సమావేశం తర్వాత విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఫేర్ గేమ్ నిర్వహించారు. అనంతరం గెలిచిన వారికి బహుమతులను అందజేశారు.



---

# చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** చిన్నారులను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అంగన్వాడి ఉపాధ్యాయులు బండ సుజాత పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో శనివారం పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య(ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడి ఉపాధ్యాయురాలు బండ సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి విచ్చేసిన తల్లిదండ్రులకు చిన్నారుల ప్రతిభను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ. 2030 సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ సాధ్యమైనంత తొందరగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. తద్వారా చిన్నారులు ఒకటవ తరగతిలో చేరేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. అన్ని అభివృద్ధి క్షేత్రాలతో గరిష్ట ఫలితాలను సాధించడమే పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య( ఈసీసీఈ) యొక్క సమగ్ర లక్ష్యం అన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రం చిన్నారులను ఆకర్షించేలా రకరకాల బొమ్మలు వస్తువులతో అలంకరించారు. ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ గురించి, బాలింతలకు గర్భిణీ, బాలింతలకు స్త్రీలకు పౌష్టిక ఆహారం



గురించి తెలియజేశారు. విద్యతో పాటు ఆటపాటల వలన పిల్లలలో శారీరక ఎదుగుదల అభివృద్ధి చెందుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు సమతుల్య, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు నాణ్యమైన విద్యను కూడా అందించడం జరుగుతుందన్నారు. చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను, మెడికల్ డిపార్ట్‌మెంట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయమ్మ , చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.